సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం । 18 । నవంబర్ । 2023



సోమశిలలో 29.590 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శుక్ర వారం సాయంత్రానికి 29.590 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 14 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు) -	రూ.63,100
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,672
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,842
నవర (8 గ్రా) -	రూ.46,736

గరిష్ఠం/కనిష్ఠం
30.8 /25.4

వాతావరణం

శుక్రవారం గాలిలో తేమ 75 శాతం ఉంది. శనివారం జిల్లాలో ఉష్ణోగ్రతలు, ఎండతీవ్రత సాధారణంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

నిబంధనల ప్రకారం రేషన్ సరఫరా

• సివిల్ సప్లైస్ డీఎం నరసింహారావు



మాట్లాడుతున్న డీఎం నరసింహారావు

నెల్లూరు(పొగతోట): గోదాముల నుంచి ఎంఎల్ఎస్ పాయింట్లకు, ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి చౌకదుకాణాలకు నిబంధనల ప్రకారం రేషన్ సరఫరా చేయాలని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పీవీ నరసింహారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం నెల్లూరులోని జిల్లా పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో ఎంఎల్ఎస్ డీటీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చౌకదుకాణాలకు సకాలంలో రేషన్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ హాస్టల్స్‌కు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఏఎం టెక్నికల్ లక్ష్మీనారాయణ, అకౌంట్స్ ఆఫీసర్ సురేంద్ర, ఎంఎల్ఎస్ పాయింట్ డీటీలు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

• డీఏఓ సత్యవాణి



వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడుతున్న డీఏఓ సత్యవాణి

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని రైతాంగానికి వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి సత్యవాణి పేర్కొన్నారు. నెల్లూరులోని తన కార్యాలయంలో ఆ శాఖ అధికారులతో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు పలు విషయాల్లో తమకు సమాచారం ఇవ్వడం లేదని వ్యవసాయశాఖ అధికారులు డీఏఓ దృష్టికి తీసుకెళ్లారు. సత్యవాణి స్పందిస్తూ రెండు శాఖలను సమన్వయం చేసుకుంటూ ఎక్కడా ఇబ్బందులు లేకుండా ముందుకెళదామని సూచించారు.

అదనపు ట్రాక్ ఏర్పాటుకు పరిశీలన



బిట్రగుంట రైల్వే యార్డ్‌లో ట్రాక్‌ను పరిశీలిస్తున్న డివిజన్ అధికారులు

బిట్రగుంట: బిట్రగుంట రైల్వే యార్డ్‌లో అదనపు ట్రాక్ ఏర్పాటుకు సంబంధించి డివిజన్‌కు చెందిన వివిధ విభాగాల సీనియర్ అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ప్రధానమంత్రి గతిశక్తి పథకంలో భాగంగా కోచ్ చెకింగ్ ఫెసిలిటీకి అవసరమైన అదనపు ట్రాక్ ఏర్పాటుపై డివిజన్‌కు చెందిన పలువురు సీనియర్ డీఈలు, ఇతర ఇంజినీరింగ్ అధికారులు బిట్రగుంట యార్డ్‌లోని ఎగువ, దిగువ మార్గాలను పరిశీలించారు. ఎగువ, దిగువ మార్గాల్లో వెళ్లే గూడ్సు రైళ్ల నిర్వహణ, చిన్న తరహా మరమ్మతులు చేసేందుకు వీలుగా కోచ్ చెకింగ్ ఫెసిలిటీ కోసం అదనపు ట్రాక్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సుమారు రూ.12 కోట్ల వ్యయంతో యార్డ్‌లో అదనపు ట్రాక్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

మద్యంషాపు సిబ్బందిపై వేటు

విడవలూరు: మండల కేంద్రమైన విడవలూరులోని ప్రభుత్వ మద్యం షాపులో పనిచేస్తున్న సూపర్‌వైజర్, ఇద్దరు సేల్స్‌మెన్‌పై వేటు పడింది. ఎక్సైజ్ సీఐ రామారావు తెలిపిన వివరాల మేరకు.. విడవలూరులోని మద్యం దుకాణంలో అవకతవకలు జరుగుతున్నాయని ఎక్సైజ్ సీఐ దృష్టికి రావడంతో గురువారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో మద్యం సేల్స్‌కు సంబంధించిన నగదు లావాదేవీల్లో రూ.46 వేలు వ్యత్యాసం కనిపించింది. దీంతో విచారణ జరిపి సూపర్‌వైజర్‌తో పాటు సేల్స్‌మెన్‌ను విధుల నుంచి తొలగించారు. ఆయన వెంట ఎస్సై రాఘవయ్య, ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.





తోడేరుకు చెందిన మహిళకు భూ పట్టా అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ హరినారాయణన్, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, జేసీ కూర్మనాథ్, సభకు హాజరైన లబ్ధిదారులు

పేద రైతుల కల సాకారం

- భూముల పంపిణీ చారిత్రాత్మకం
- సీఎం వైఎస్ జగన్ సాహసోపేత నిర్ణయం
- వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: దశాబ్దాల పేద రైతుల కల సాకారం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని, పేద రైతులకు భూములు పంపిణీ చేసేలా ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లావ్యాప్తంగా అసైన్మెంట్, ఎస్సీ కార్పొరేషన్, సర్వీస్ ఇనాం, చుక్కల భూములకు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం పొదలకూరులోని కల్యాణ మండపంలో కలెక్టర్ ఎం.హరినారాయణన్, జేసీ కూర్మనాథ్, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మలతో కలిసి మంత్రి కాకాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూముల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారని తెలిపారు. జిల్లాకు సంబంధించి పొదలకూరులో రైతులకు భూముల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతుల చిరకాల ఆకాంక్షను తీరుస్తూ రూ.కోట్లాది విలువైన భూములను అందజేసినట్లు తెలిపారు. జిల్లాలో 6 వేలకుపైగా ఎకరాల అసైన్మెంట్ భూములను పంపిణీ చేస్తుండగా, ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే 5,023 ఎకరాలను అందజేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 20,24,709 కుటుంబాలకు భూముల పట్టాలను అందజేస్తున్నామని, జిల్లాలో 5,517 మందికి 6,507 ఎకరాల అసైన్మెంట్ భూములకు పట్టాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 20 ఏళ్లుగా అసైన్మెంట్ భూములను సాగు చేసుకుంటున్న 21,415 మంది రైతులకు 37,863 ఎకరాల భూములకు, 1,407 మంది రైతులకు 2,565 ఎకరాల చుక్కల భూములకు శాశ్వత భూహక్కులను కల్పిస్తున్నట్లు తెలిపారు. 1,446 మంది రైతులకు 971 ఎకరాల భూములకు, 61 ఎకరాల ఇనాం భూములకు హక్కులు కల్పిస్తూ పట్టాలను అందజేస్తున్నట్లు తెలిపారు. పేదలకు భూములు ఇవ్వడం ఇష్టం లేని టీడీపీ నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అధికారులను బెదిరిస్తూ, న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని చెబుతుండడం దారుణమన్నారు. గత ప్రభుత్వంలో టీడీపీ కార్యకర్తలకే భూములను అందజేశారని, తమ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అర్హులకు భూముల పట్టాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

అర్హులకే భూముల పంపిణీ: కలెక్టర్

అర్హులైన వారికే భూముల పట్టాలను పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. జిల్లాలో 25 వేల మంది రైతులకు పట్టాలు అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులకు అందజేసే భూముల విలువ రూ.4 వేల కోట్లు ఉంటుందన్నారు. రెవెన్యూశాఖ పరంగా రైతులకు అన్నిరకాల సేవలను అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 46 వేల ఎకరాలకు సంబంధించి చుక్కల భూముల సమస్యలను పరిష్కరించి పట్టాలను అందజేశామని తెలిపారు. మండలాల వారీగా భూపట్టాలను అందజేస్తామన్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్, నెల్లూరు ఆర్డీఓ ఎ.మలోలా మాట్లాడారు. రెవెన్యూ అధికారులు గ్రామాల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేసి లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.వీరవసంతరావు, వైస్ ఎంపీపీ వేణంబాక చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, రావుల దశరథరామయ్యగౌడ్, జేసీఎస్ కన్వీనర్ బచ్చల సురేష్‌రెడ్డి, సర్పంచ్ చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నో ఏళ్ల కల నెరవేరింది



ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమికి పట్టా లేక ఇబ్బందులు పడ్డాం. రాష్ట్ర ప్రభుత్వం పట్టాను అందజేయడం సంతోషంగా ఉంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– బొమ్మిశెట్టి మాధవి, ఊసపల్లి, పొదలకూరు మండలం

కాళ్లరిగేలా తిరిగాం



సాగు చేసుకుంటున్న భూమికి పట్టా కోసం కాళ్లరిగేలా తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పుడు పిలిచి మరీ భూమికి పట్టాను అందజేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి కాకాణి మేలు మరచిపోలేను.

– ముత్యాల రమణమ్మ, తోడేరు, పొదలకూరు మండలం

భూమికి శాశ్వత హక్కు



రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరగలేదు. ఎవరికీ నగదు ఇవ్వలేదు. ఎలాంటి శ్రమ లేకుండానే సాగు చేసుకుంటున్న భూమికి శాశ్వత హక్కుగా పట్టాను అందజేశారు. ప్రభుత్వం పేదల కష్టాలను అర్థం చేసుకుని పాలిస్తోంది.

– సూరి లక్ష్మీదేవమ్మ, అల్లూర్తి, పొదలకూరు మండలం

ఆశలు వదులుకున్నాం



నేను బతికి ఉండగా భూమికి పట్టా తీసుకుంటానని అనుకోలేదు. ఎన్నో ఏళ్లుగా మా వాళ్లు తిరుగుతున్నా పనికాలేదు. ఆశలు వదులుకున్నాం. ఇపుడు ప్రభుత్వం భూముల పంపిణీ పేరుతో పేదవాళ్లకు పిలిచి మరీ పట్టాలను అందజేయడం సంతోషంగా ఉంది.

– చిదదల పెంచలమ్మ, బిరదవోలు, పొదలకూరు మండలం

ఇదేం చెత్త పని

పరిశ్రమల నిర్వాహకుల ఇష్టారాజ్యం.. అధికారులు పట్టించుకోకపోవడం వెరసి వెంకటాచలం మండలం కాకుటూరు పంచాయతీ పరిధిలోని పరిశ్రమల కేంద్రం చెత్త నిల్వల కేంద్రంగా మారిపోయింది. ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేసే కొన్ని పరిశ్రమలు నిబంధనలు పాటించకుండా రోడ్లపైనే ప్లాస్టిక్‌ను నిల్వ చేస్తున్నాయి. అలాగే నెల్లూరు నగరంలోని చెత్తను పరిశ్రమల కేంద్రం వద్ద డంపింగ్ చేయడంతో ఈ ప్రాంతమంతా కంపు కొడుతోంది. సమీపంలోనే విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉండడంతో విద్యార్థులతో పాటు పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు దుర్వాసన భరించలేకపోతున్నారు. ఇదేం చెత్త పని అంటూ నిలదీస్తున్నారు.

- కాకుటూరు పరిశ్రమల కేంద్రంలో చెత్త నిల్వలు
- కంపు భరించలేకపోతున్న వీఎస్‌యూ విద్యార్థులు



వీఎస్‌యూ హాస్టల్‌కు సమీపంలో తిక్కవరప్పాడు బ్రాంచి కెనాల్‌పై చెత్త కుప్పలు



పరిశ్రమల కేంద్రం మధ్యలో ఓ ప్లాస్టిక్ పరిశ్రమ నెలల తరబడి నిల్వ ఉంచిన ప్లాస్టిక్

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి పక్కనే ఉన్న పరిశ్రమల కేంద్రం మధ్యలో తిక్కవరప్పాడు బ్రాంచ్ కెనాల్, వెనుక వైపున విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉన్నాయి. ఈ పరిశ్రమల కేంద్రంలోని మొత్తం 35 ఎకరాల్లో 50కు పైగా పరిశ్రమలు ఉండగా, నాలుగు ప్లాస్టిక్ రీసైక్లింగ్ పరిశ్రమలు ఉన్నాయి. జిల్లా నలుమూలల నుంచి తీసుకువచ్చిన ప్లాస్టిక్‌ను పరిశ్రమల నిర్వాహకులు రోడ్లపైనే నెలల తరబడి ఉంచుతున్నారు. నిబంధనల ప్రకారం ప్లాస్టిక్ రీసైక్లింగ్ చేసే పరిశ్రమల నిర్వాహకులు తమ పరిశ్రమ ప్రాంగణంలోనే నిల్వ ఉంచుకోవాలి. కానీ నిబంధనలను అతిక్రమిస్తూ రోడ్లపై, ఖాళీ స్థలాల్లో నిల్వ ఉంచుతున్నారు. అలాగే నెల్లూరు నగరంలో వచ్చే చెత్తను వేసేందుకు కొత్తూరు ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఉంది. ఈ డంపింగ్ యార్డుకు నెల్లూరు నుంచి చెత్తను తీసుకువెళ్లే టిప్పర్లు కొన్ని జాతీయ రహదారిపై వచ్చి తిక్కవరప్పాడు బ్రాంచ్ కెనాల్‌పై వెళ్లి డంపింగ్ యార్డ్‌లో చెత్తను అన్‌లోడ్ చేస్తున్నాయి. అయితే కొందరు టిప్పర్ల డ్రైవర్లు డంపింగ్ యార్డు వరకు వెళ్లకుండా తిక్కవరప్పాడు బ్రాంచ్ కెనాల్ పొడవునా చెత్తను అన్‌లోడ్ చేసి వెళ్లిపోతున్నారు. దీంతో నగరంలోని చెత్త మొత్తం తిక్కవరప్పాడు బ్రాంచ్ కెనాల్‌లోనూ, కట్టపైనే చేరుతోంది. కాలువ కట్టపై చెత్తను వేయడంతో సమీపంలో ఉన్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలోని హాస్టల్ విద్యార్థులు, పరిశ్రమల్లో పనిచేస్తున్న సిబ్బంది ఈ దుర్వాసన భరించలేకపోతున్నారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న డంపింగ్ యార్డ్‌లోనే చెత్తను డంప్ చేసేలా అధికారులు చర్యలు చేపడితే విద్యార్థులకు ఎలాంటి సమస్య ఉండదు. కానీ విశ్వవిద్యాలయం హాస్టల్‌కు సమీపంలో చెత్త డంప్ చేయడంతో దుర్వాసనకు తట్టుకోలేక కొందరు విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారు.



చెత్తను తరలిస్తున్న టిప్పర్లు

కంపు బాబోయ్

కాకుటూరు పంచాయతీలోని పరిశ్రమల కేంద్రంలో ఉన్న కొన్ని పరిశ్రమల నిర్వాహకులు వ్యర్థాలను కూడా ఖాళీ స్థలాల్లోకి వదిలివేయడంతో వర్షాకాలంలో సమస్య తీవ్రత ఎక్కువగా ఉంటోంది. మిగతా పరిశ్రమల నిర్వాహకులు, అధికారులు ఈ సమస్యను పట్టించుకోవడం లేదు. పరిశ్రమల్లోని సిబ్బందే కాక, జాతీయ రహదారి సమీపంలో కాలువ ఉండడంతో వాహనచోదకులు ఈ కంపును భరించలేకపోతున్నారు. నిత్యం అధికారులు రాకపోకలు సాగిస్తున్నా, ముక్కుమూసుకుని వెళుతున్నారే గానీ చెత్త ఎందుకు అన్‌లోడ్ చేస్తున్నారని ఎవరూ ప్రశ్నించిన దాఖలాలు లేవు. గతంలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం అధికారులు ఈ సమస్యను నెల్లూరు కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో కొన్ని రోజులపాటు టిప్పర్ డ్రైవర్లు తిక్కవరప్పాడు బ్రాంచ్ కెనాల్ వద్ద చెత్త డంపింగ్ చేయకుండా వెళ్లేవారు. మళ్లీ గత కొద్ది నెలలుగా టిప్పర్ డ్రైవర్లు యథావిధిగా కాలువ కట్టపై డంపింగ్ చేస్తుండడంతో ఆ ప్రాంతమంతా కంపు కొడుతోంది. ఈ సమస్యపై అధికారులు దృష్టిసారించి చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

చెత్త నిల్వ లేకుండా చేయాలి



వీఎస్‌యూ హాస్టల్‌కు సమీపంలో చెత్త నిల్వ చేస్తున్నారు. చెత్త నిల్వల కారణంగా దుర్వాసన, దోమల బెడద ఉంటోంది. టిప్పర్ల డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగానే ఇలా జరుగుతోంది. అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– తురకా ప్రసాద్, ఆంధ్రా విద్యార్థి సంఘం నాయకుడు

చర్యలు చేపడతాం

పరిశ్రమల కేంద్రంలోని రోడ్లపై నిబంధనల ప్రకారం చెత్త నిల్వలు వేయకూడదు. ఖాళీ స్థలాల్లోకి వ్యర్థాలను మళ్లించడం, నెలల తరబడి చెత్త నిల్వ ఉంచడం మా దృష్టికి రాలేదు. పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా చెత్త నిల్వలు చేసే వారిపై చర్యలు తీసుకుంటాం.

– చంద్రశేఖర్, ఏపీ ఐఐసీ జోనల్ మేనేజర్

యార్డులోనే డంప్ చేయాలి

నెల్లూరు నగరంలోని చెత్తను పరిశ్రమల కేంద్రం వద్ద డంప్ చేయకుండా చర్యలు చేపడతాం. నిబంధనల ప్రకారం డంపింగ్ యార్డ్‌లోనే టిప్పర్లు చెత్తను డంప్ చేయాలి. పంచాయతీ అధికారులను పంపి చెత్త నిల్వ చేయకుండా చర్యలు చేపడతాం.

– ముజీబున్నీసా, ఎంపీడీఓ

ఓటరు జాబితాలను పారదర్శకంగా రూపొందించాలి



ఓటరు జాబితాలను పరిశీలిస్తున్న ఆర్వో బాపిరెడ్డి

కోవూరు: ఓటరు జాబితాలను పారదర్శకంగా రూపొందించాలని కోవూరు నియోజకవర్గ ఆర్ఓ బాపిరెడ్డి బీఎల్వోలను ఆదేశించారు. స్థానిక సంఘమిత్ర కార్యాలయంలో తహసీల్దార్ ఎం పద్మజ ఆధ్వర్యంలో బీఎల్వోలు, సూపర్‌వైజర్లతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బీఎల్వోలు వారికి కేటాయించిన విధులు, బాధ్యతల విషయంలో అలసత్వం వహించకుండా జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. కోవూరు నియోజకవర్గ పరిధిలో ఫాం-6, 7, 8కు సంబంధించి 11 వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వాటిని నిశితంగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో మృతులకు సంబంధించిన ఓట్లను తొలగించాలన్నారు. ఓట్ల తొలగింపు సమయంలో ఒకటికి రెండు సార్లు నిశితంగా పరిశీలించాలన్నారు. ఓటరుకు సంబంధించిన ఫొటోల అప్‌లోడ్ విషయంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డబుల్ ఎంట్రీలు లేకుండా చూడాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఇలియాజ్ , ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, సీనియర్ అసిస్టెంట్ సుధ పాల్గొన్నారు.

యువకుడి ఇంటి ముందు యువతి ధర్నా



యువకుడి ఇంటి వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

పొదలకూరు: ఏడేళ్లుగా ప్రేమ పేరుతో వంచించి అన్నివిధాలుగా వాడుకుని తీరా వివాహం చేసుకోమంటే నిరాకరిస్తున్నాడని ఓ యువతి యువకుడి ఇంటి ముందు ధర్నాకు దిగిన ఘటన పొదలకూరు మండలం నేదురుమల్లి ఎస్సీకాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితురాలి వివరాల మేరకు.. నెల్లూరు నగరానికి చెందిన కాకి సోనియా, నేదురుమల్లికి చెందిన సాగర్ ఏడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే తనను వివాహం చేసుకోమని సాగర్‌ను సోనియా గట్టిగా పట్టుపట్టడంతో ముఖం చాటేశాడు. దీంతో ఆమె దిశ ప్రొటక్షన్ చైర్మన్ అరుణ, కమిటీ సభ్యులు, మహిళా సంఘాలను ఆశ్రయించారు. వారితో కలిసి సాగర్ ఇంటి వద్దకు వెళ్లి ధర్నాకు దిగారు. అయితే యువకుడితోపాటు వారి కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసుకుని వెళ్లిపోయారు. దీంతో మహిళా సంఘాల వారు సోనియాకు న్యాయం జరిగే వరకు పోరాడతామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నాగేంద్రునికి ప్రణమిల్లి..

నాగులచవితి సందర్భంగా జిల్లావ్యాప్తంగా శుక్రవారం భక్తులు పుట్టలలో పాలుపోసి, పూజలు చేసి తమ భక్తిని చాటుకున్నారు. ఉదయాన్నే అధిక సంఖ్యలో మహిళా భక్తులు పుట్టల వద్దకు వచ్చి పసుపు, కుంకుమలు చల్లి నాగేంద్రునికి ప్రణామాలర్పించారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్



నెల్లూరు మూలాపేట శ్రీమద్ ద్రౌపది సమేత శ్రీకృష్ణధర్మరాజస్వామి దేవస్థానంలో..



పుట్ట వద్ద పసుపు కుంకుమలతో పూజలు చేస్తున్న మహిళలు



నెల్లూరు పుట్టలేఅవుట్ పార్కుకట్ట రోడ్డులోని నాగేంద్రస్వామికి పాలాభిషేకం

పెద్ద మనిషి ముసుగులో దందా


రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అనిల్‌కుమార్

- టీడీపీ నేత నారాయణపై ధ్వజమెత్తిన ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): పద్దెనిమిది కోట్ల పెట్టుబడి పెట్టి రూ.800 కోట్లను మాజీ మంత్రి నారాయణ స్వాహా చేశారని, పెద్ద మనిషి ముసుగులో దందా సాగించే వారిని వైట్‌కాలర్ నేరస్తులంటారని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 48వ డివిజన్ పార్లుకట్టలో రూ.1.5 కోట్లతో నిర్మించనున్న రోడ్లు, డ్రెయిన్లకు శంకుస్థాపనను శుక్రవారం చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పార్లుకట్టలో పర్యటిస్తున్న సమయంలో సమస్యను స్థానికులు తెలియజేశారని, ఈ నేపథ్యంలో శంకుస్థాపనను చేపట్టామని వివరించారు. ఇప్పటి వరకు రూ.తొమ్మిది కోట్లతో డివిజన్లో అభివృద్ధి పనులను చేపట్టామని వెల్లడించారు. నగరాన్ని ఎవరు అభివృద్ధి చేశారనే అంశమై చర్చకు ఆహ్వానిస్తే.. ఎందుకు రావాలనడం హాస్యాస్పదమన్నారు. నెల్లూరును స్మార్ట్ సిటీగా ఎందుకు మార్చలేకపోయారని ప్రశ్నించారు. హడ్కో నుంచి గతంలో రూ.800 కోట్లను తీసుకొచ్చి రుణ భారాన్ని ప్రజలపై మోపారని, ఈ క్రమంలో తమ ప్రభుత్వం రూ.600 కోట్లను భరించిందని గుర్తుచేశారు. నారాయణకు హాస్పిటల్ ఉన్నా, ఏ ఒక్కరికైనా ఉచితంగా వైద్యం చేశారానని ప్రశ్నించారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌చార్జి సిద్ధిక్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ హయాంలో సుపరిపాలన

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి


మాట్లాడుతున్న పురందేశ్వరి

నెల్లూరు(మినీబైపాస్): దేశానికి ప్రధాని నరేంద్రమోదీ సుపరిపాలనను అందిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. బీజేపీ నెల్లూరు జిల్లా పోలింగ్ బూత్ స్థాయి అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలతో జిల్లా స్థాయి సమావేశాన్ని నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తే ఆదాయ వనరులు పెరుగుతాయని చెప్పారు. అనంతరం కార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు. తొలుత ఆమెను సత్కరించారు. అనంతరం నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌ను సందర్శించి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను ఆరాతీశారు. రూ.103 కోట్లతో రైల్వేస్టేషన్‌ను సుందరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాజేశ్వరమ్మ, రాష్ట్ర అధికార ప్రతినిధి జయప్రకాష్, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వంశీకృష్ణ, సురేంద్రరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చోరీలను అరికట్టేలా చర్యలు

- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి


మాట్లాడుతున్న తిరుమలేశ్వరరెడ్డి

విడవలూరు: జిల్లాలో చోరీలను అరికట్టేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా విడవలూరు మోడల్ పోలీస్‌స్టేషన్‌కు శుక్రవారం విచ్చేసిన ఆయన పలు రికార్డులను పరిశీలించారు. కేసు వివరాలతో పాటు నిందితుల అరెస్ట్‌పై ఆరా తీశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో పశువుల దొంగతనాలు జరుగుతున్నాయని, వీటి నివారణకు చర్యలు చేపట్టనున్నామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించాలని, శాంతిభద్రతల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అడిషనల్ ఎస్పీ హిమవతి, డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, కోవూరు సీఐ వెంకటేశ్వర్లు, బుచ్చిరెడ్డిపాళెం, విడవలూరు ఎస్సైలు మహేంద్ర, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీ నేతపై దాడి


చికిత్స పొందుతున్న తిరుపతిరెడ్డి

చేజర్ల: ఓ భూమి సర్వేకు సంబంధించిన వివాదంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతపై టీడీపీ నేతలు దాడికి పాల్పడిన ఘటన మండలంలోని యనమదలలో శుక్రవారం చోటు చేసుకుంది. వివాదం జరగకుండా సర్పంచ్ నోటి సుందరరామిరెడ్డి సర్దుబాటు చేసేందుకు యత్నించారు. అయితే టీడీపీ నేతలు సర్వే అధికారులను అడ్డుకొని అక్కడి నుంచి పంపి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత నోటి తిరుపతిరెడ్డిపై దాడికి పాల్పడ్డారు. గాయపడిన తిరుపతిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు.


నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

		బ్రాయిలర్ చికెన్:	రూ.194
బ్రాయిలర్:	రూ.107	స్కిన్‌లెస్ చికెన్:	రూ.214
లేయర్	రూ.105	లేయర్ చికెన్:	రూ.178



నిమ్మ ధరలు
పొదలకూరు (కిలో)

పెద్దవి: రూ. 40
సన్నవి: రూ. 15
పండ్లు: రూ. 6





ఆరోగ్య సంజీవని

ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిన రాష్ట్ర ప్రభుత్వం 108 సేవలను మరింత విస్తృతం చేసింది. అనారోగ్యంతోనో.. ప్రమాదంలో గాయపడో ఎవరైనా 108కు ఫోన్ చేస్తే నిమిషాల వ్యవధిలోనే ఘటన స్థలానికి చేరుకొని ఆపద్బాంధవుడిలా ఆస్పత్రికి చేరుస్తూ ప్రాణాలను నిలబెడుతోంది. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో పురుడుపోసుకున్న 108 ద్వారా ఎన్నో లక్షల మంది ప్రాణాలను ఇప్పటి వరకు కాపాడారు.

- ప్రజల ఆరోగ్యానికి భరోసాగా '108'
- ఫోన్ చేస్తే క్షణాల్లో చెంతకు
- ప్రతి మండలానికో వాహనం
- అత్యాధునిక సౌకర్యాలు
- మూడేళ్లలో 1,88,684 మందికి సేవలు



కోవూరు: ప్రజల ఆరోగ్య రక్షణకు 108 అండగా నిలుస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో నేనున్నాంటూ ఈ వాహనం 15 నిమిషాల్లోనే ఇంటి ముంగిటకు వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో సరైన దిశానిర్దేశం లేకపోవడంతో సేవలు అంతంతమాత్రంగానే అందేవి. అయితే జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఈ వాహన సేవలకు పునరుజ్జీవం కల్పించారు. అత్యాధునిక సౌకర్యాలతో 108 వాహనాల రూపురేఖలను మార్చారు.


అత్యాధునిక సౌకర్యాలు

జిల్లాలో 40 వాహనాలు

జిల్లాలో 2005లో 108 సేవలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో మొత్తం 40 వాహనాలున్నాయి. ఇందులో నియోనెటల్ వాహనాలు రెండు, ఏఎల్ఎస్ వాహనాలు ఐదు, క్షతగాత్రులను సకాలంలో సమీపంలోని వైద్యశాలకు చేర్చే వాహనాలు 33 ఉన్నాయి. వీటి ద్వారా అన్ని రకాల ప్రమాద బాధితులు, గర్భిణులు, మూర్ఛ తదితర అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులను సకాలంలో ఆస్పత్రికి చేర్చి ప్రాణాలను కాపాడారు. 2020లో మండలానికో వాహనాన్ని కేటాయించారు.

నేనున్నానంటూ..

- తోటపల్లిగూడూరు మండలం దేవరదిబ్బకు చెందిన ఓ గర్భిణికి పురిటి నొప్పులొచ్చాయంటూ కుటుంబసభ్యులు 108కు ఫోన్ చేశారు. దీంతో ముత్తుకూరులో ఉన్న 108 వాహనం 20 నిమిషాల వ్యవధిలో అక్కడికి చేరుకొని గర్భిణిని ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఆమె పండంటి బిడ్డకు జన్మనిచ్చారు.
- నెల్లూరులోని నవాబుపేటలో గర్భిణికి పురిటి నొప్పులొస్తున్నాయని రాత్రి 11.02కు 108కు ఫోన్ చేశారు. కేవలం ఎనిమిది నిమిషాల వ్యవధిలో ఘటన స్థలానికి చేరుకొని 11.50కు ప్రసవం చేసి తల్లీబిడ్డను నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు.


108లో ప్రసవించిన మహిళ (ఫైల్)

సేవలను ఉపయోగించుకోండి

జిల్లాలో ప్రతి మండలానికి ఒకటి చొప్పున వాహనాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికీ కొందరు చికిత్స కోసం ఆస్పత్రులకు ప్రైవేట్ వాహనాల ద్వారా వెళ్తున్నారు. 108లో వెళ్తే ప్రాథమిక చికిత్స చేస్తూ.. అవసరమైతే ఆస్పత్రికి తీసుకెళ్తారు. దీని ద్వారా రోగి విలువైన ప్రాణాలను కాపాడే అవకాశం ఉంది.

– బాలు, 108 జిల్లా కోఆర్డినేటర్

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి మండల పూజలు


శీవేలి ఉత్సవం

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో 41 రోజుల పాటు నిర్వహించనున్న మండల పూజలను కేరళ సంప్రదాయరీతిలో భక్తిశ్రద్ధలతో శుక్రవారం ప్రారంభించారు. శబరిమలలోని అయ్యప్ప ఆలయానికి చెందిన వడకేడత్తు పెరుంబడప్పమన కేశవన్ నంబూద్రిపాద్ ప్రధాన తంత్రి ఆధ్వర్యంలో నిర్మాల్య దర్శనం, క్షీరాభిషేకం, మహాగణపతి హోమం, ఉషఃపూజ, శీవేలి ఉత్సవం, కలశ పూజ, నవకాభిషేకం, తదితరాలను నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదాన్ని అందజేశారు. ఉభయకర్తలుగా కాటంరెడ్డి నిషిత్‌రెడ్డి, సాయిశ్రియారెడ్డి, మోపూరు సాహిల్‌రెడ్డి, శ్రితారెడ్డి, కిరణ్‌కుమార్‌జైన్, హేమలత, గంటా రమణయ్యనాయుడు, ప్రమీల దంపతులు వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ పాలకమండలి అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, సభ్యులు శంకరన్, మురళీమోహన్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

వైభవంగా కామాక్షితాయి కల్యాణం


సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు, కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో కల్యాణోత్సవాన్ని వేడుకగా శుక్రవారం నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆదిదంపతులను విశేషంగా అలంకరించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం సామూహిక కుంకుమార్చనను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్తీక దీపాలను వెలిగించి ఆదిదంపతులను దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ లక్ష్మీసుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ గిరికృష్ణ పర్యవేక్షించారు.

బిగ్ స్క్రీన్‌పై ఫైనల్స్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రపంచ కప్‌లో భారత్ – ఆస్ట్రేలియా మధ్య ఆదివారం జరగనున్న ఫైనల్స్‌ను వీక్షించేందుకు వీలుగా జిల్లా కేంద్రాల్లో బిగ్ స్క్రీన్లను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నామని అసోసియేషన్ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడారు. అభిమానులు ఉచితంగా వీక్షించొచ్చని, అక్కడ ఫుడ్ కౌంటర్లను సైతం ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. పెద్ద స్క్రీన్ల ఏర్పాటు విషయమై కోరిన వెంటనే అనుమతులిచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలియజేశారు. నగరంలోని వీఆర్ హైస్కూల్ మైదానంలో బిగ్ స్క్రీన్‌ను ఏర్పాటు చేయనున్నామని, అభిమానులు తరలిరావాలని కోరారు.

ఎలుకల మందు తిని.. ఆపై ఆరోగ్యం విషమించి..

గుడ్లూరు: క్షణికావేశంలో ఎలుకల మందు తిని చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తపేటలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన సింధూజ (26), తన భర్త సురేంద్ర, ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటి వద్దే ఉంటున్నారు. వైఎస్సార్ క్రాంతి పథంలో వీఓగా ఈమె పనిచేస్తున్నారు. ఇంటి వద్ద పశువులకు మేతను తీసుకొచ్చేందుకు గాను తల్లికి సాయంగా పొలానికి వెళ్లాలని సింధూజకు తండ్రి రామకృష్ణ సూచించారు. దీనికి ఆమె నిరాకరించగా, తల్లికి సాయం చేయకపోతే ఎలా అని తండ్రి ప్రశ్నించారు. మనస్తాపానికి గురవడంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతుండటంతో క్షణికావేశంలో ఇంట్లో ఉన్న ఎలుకల మందును తిన్నారు. రెండు రోజుల పాటు విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. అయితే అన్నం తినకుండా నలతగా ఉండటంతో కుటుంబసభ్యులు గట్టిగా ప్రశ్నించడంతో విషయాన్ని తెలియజేశారు. దీంతో వారు వెంటనే కందుకూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో చెన్నైకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మరణించారు. తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రసాద్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.